క్లుప్తంగా

విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ



బాపట్ల అర్బన్: మరుప్రోలువారిపాలెం ప్రాథమిక పాఠశాల విద్యార్థులు 75 మందికి బాపట్ల ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నోట్ పుస్తకాలు, పలకలు, పెన్నులు, బిస్కెట్ ప్యాకెట్లను శనివారం పంపిణీ చేశారు. ముఖ్య అతిథి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రమాదేవి విశ్రాంత ఉద్యోగుల సేవా కార్యక్రమాలను అభినందించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు వి.వెంకటేశ్వర్లు, పీవీకే రామారావు అహ్మద్, తిరుపతిరావు, కోటేశ్వరరెడ్డి, కోటేశ్వరరావు, డి.వెంకటేశ్వర్లు, లింగరావు, షౌకత్, వడయార్, పాఠశాల హెచ్ఎం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కళ్లజోళ్లు పంపిణీ



రేపల్లె: పట్టణంలోని వీరవల్లి కోటయ్య ఫంక్షన్ హాలులో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం 150 మంది పేదలకు కళ్లజోళ్లు పంపిణీ చేశారు. జూన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరం ద్వారా శస్త్ర చికిత్స చేయించుకున్న వారికి ఈ కళ్లజోళ్లు అందించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు సక్సేనా, కార్యదర్శి పావులూరి శివశంకర్ ప్రసాద్, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ వసంతం వీరరాఘవయ్య, సభ్యులు పాల్గొన్నారు.

ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

రేపల్లె: ఆశ వర్కర్స్ సమస్యలు పరిష్కరించాలని ఈ నెల 18న డీఎం అండ్ హెచ్‌ఓ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు ఆశ వర్కర్స్ యూనియన్ మోళ్లగుంట అధ్యక్షురాలు సీహెచ్ వీరలక్ష్మి, రేపల్లె పట్టణ అధ్యక్షురాలు టి.బుజ్జి శనివారం తెలిపారు. ఈ సందర్భంగా మొళ్లగుంట, రేపల్లె పట్టణ అర్బన్ హెల్త్ సెంటర్ల మెడికల్ అధికారులకు వినతిపత్రం అందచేసి, మాట్లాడారు. ధర్నాలో ఆశ వర్కర్‌లు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. యూనియన్ సభ్యులు లక్ష్మీ నాంచారమ్మ, వెంకటేశ్వరమ్మ, పావని పాల్గొన్నారు.

పని ఒత్తిడి తగ్గించాలి

భట్టిప్రోలు: ఆశ కార్యకర్తలపై పని ఒత్తిడి తగ్గించాలని సీఐటీయూ మండల కార్యదర్శి జి.సుధాకర్ కోరారు. ఆశ సమస్యల పరిష్కారానికి ఈ నెల 18న రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన ధర్నాను జయప్రదం చేయాలని కోరారు.

ట్రాక్టర్ తిరగబడి డ్రైవర్ మృతి




బాపట్ల: బాపట్ల పట్టణంలోని మచ్చావారిపాలెం వద్ద ట్రాక్టర్ తిరగబడి బెజ్జం ఓషయ్య(33) మృతి చెందారు. పట్టణంలోని దర్శిపెద్ద మస్తాన్‌నగర్‌కు చెందిన వెంకటేశ్వర్లు ట్రాక్టర్ డ్రైవర్‌గా ఉప్పరపాలేనికి చెందిన బెజ్జం ఓషయ్య పని చేస్తున్నాడు. మచ్చావారిపాలెంలో శనివారం ట్రాక్టర్ తిరగబడి అక్కడిక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు.

నాగరాజుపాలెంలో పశువైద్య శిబిరం

కర్లపాలెం: పశువులలో వచ్చే వ్యాధులకు సకాలంలో వైద్యం చేయించాలని కర్లపాలెం పశు వైద్యాధికారి ఎం.రేచల్ దివ్య తెలిపారు. నాగరాజుపాలెంలో శనివారం ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 40 పశువులకు గర్భకోశ వ్యాధులకు వైద్య చికిత్సలు నిర్వహించారు. 8నెలల లోపు దూడలకు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. ఈ సందర్భంగా పశు వ్యాధులకు సంబందించిన మందులను డాక్టర్ రేచల్ దివ్య రైతులకు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎస్‌కె మస్తాన్‌బీ, సిబ్బంది బి.రాజేష్ నవీన్, రహమతున్నీసా, బాల శకంర్‌రెడ్డి, శ్రీనివాసాచార్యులు తదితరులు ఉన్నారు.

చెరుకుపల్లి ఎస్సైగా సురేష్ బాధ్యతల స్వీకారం



చెరుకుపల్లి: చెరుకుపల్లి ఎస్సైగా వై.సురేష్ శనివారం ఉద్యోగ భాధ్యతలు స్వీకరించారు. ఆయన గతంలో భట్టిప్రోలు, రేపల్లె టౌన్ ఎస్సైగా విధులు నిర్వహించారు. ఇప్పటి వరకు చెరుకుపల్లి ఎస్సైగా విధులు నిర్వహించిన డి.వెంకట కొండారెడ్డి బదిలీపై బాపట్ల పోలీసు కార్యాలయానికి వెళ్లారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ శాంతి భద్రతలు, ట్రాఫిక్ సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టి, ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తామన్నారు.

భావపురికి నాణ్యమైన వైద్యం

గతంలో ప్రతి చిన్న రోగానికి గుంటూరు వైపు చూపించే.. బాపట్ల ప్రభుత్వాసుపత్రి నేడు కార్పొరేట్ వైద్యాన్ని రోగులకు అందిస్తోంది. ఇటు తీరం వెంబడి గంగపుత్రులకు, అటు రైతులు, పేద ప్రజలకు ఏ చిన్న రోగమొచ్చినా అత్యాధునిక వైద్యంతో అక్కున చేర్చుకుంటోంది. ఒకప్పుడు ఓపీ రాసే వారు లేక, వైద్యులు కానరాక నీరసించిన రోగులకు.. నేడు ప్రతి విభాగానికీ ప్రత్యేక వైద్యుడితో.. నాడి పట్టి మరీ ధైర్యం చెబుతోంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక హాస్పిటల్‌కు అన్ని వసతులు కల్పించి, అభివృద్ధి చేసింది. దీంతో ఆరోగ్యమస్తు అంటూ భావపురి ప్రజలను ఆశీర్వదిస్తోంది.

- మారిన బాపట్ల ఏరియా వైద్యశాల రూపురేఖలు
- ప్రత్యేక విభాగాలకు 16 మంది వైద్యుల నియామకం
- వంద పడకలు, 96 మంది సిబ్బంది
- రోజుకు 400 వరకు ఓపీ



బాపట్లలో ఏరియా వైద్యశాల

బాపట్ల అర్బన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టాక విద్య, వైద్య రంగాలకు పెద్ద పీట వేశారు. చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా నాడు – నేడు పథకం ద్వారా ఆసుపత్రుల రూపురేఖలు మార్చేశారు. పేదోడికి ఒక్కరూపాయి కూడా ఖర్చు కాకుండా కార్పొరేట్ వైద్యాన్ని అందిస్తున్నారు. ప్రతి ఆస్పత్రిలో వైద్య పరికరాలు, సిబ్బంది నియామకంతో ప్రత్యేక దృష్టి సారించారు. దీంతో మారుమూల పల్లెకు కూడా ప్రభుత్వ వైద్యం కార్పొరేట్ స్థాయిలో అందుతోంది.

మారిన బాపట్ల ప్రభుత్వాసుపత్రి రూపురేఖలు

గత తెలుగుదేశం ప్రభుత్వంలో.. చిన్న సమ్యతో రోగి బాపట్ల ఏరియా వైద్యశాలకు వచ్చినా..గుంటూరు రిఫర్ చేసేవారు. అప్పటి ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో వైద్య పరికరాలు, వైద్యులు లేక రోగులు ఆస్పత్రి వైపు కూడా చూసే వారు కాదు. నేడు ఆ పరిస్థితి పూర్తిగా మారిపోయింది. స్థానిక ఎమ్మెల్యే కోన రఘుపతి ప్రత్యేక చొరవతో బాపట్ల ఏరియా వైద్యశాల రూపురేఖలు మారిపోయాయి. అన్ని విభాగాలకు డాక్టర్ల నియామకం పూర్తయింది. ఇప్పుడు ఇద్దరు జనరల్ సర్జన్లు, ఇద్దరు పీడియాట్రిక్, మత్తు, స్కిన్, ఈఎన్‌టీ, డెంటల్, రేడియాలజీ, పెటాలజీ, సైక్రియాటీ వంటి విభాగాలకు కలిపి మొత్తం 16 మంది ప్రత్యేక వైద్యులు సేవలందిస్తున్నారు.

అత్యాధునిక.. వైద్య పరికరాలు

టీడీపీ ప్రభుత్వంలో వైద్యశాలలోని వైద్య పరికాలు మూలనపడ్డాయి. చిన్న ఎక్స్ రేకు కూడా ప్రైవేటు ల్యాబ్‌లకు పంపించేవారు. కొన్ని సమయాల్లో కట్టు కట్టేందుకు కూడా సిబ్బంది లేక ఆస్పత్రి గుమ్మం తొక్కాలంటే రోగులు భయపడేవారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఆస్పత్రిలో వైద్య ప్రాధాన్యంగా పరికరాలు ఏర్పాటు చేశారు. మూడు అల్ట్రా సౌండ్ స్కానింగ్, మూడు ఎక్సరే మిషన్లు, 73 పరీక్షలు చేయగల సామర్థ్యంలో లేబొరేటరీ సౌకర్యం కల్పించారు. దీంతో పాటు బ్లడ్ సెంటర్ ల్యాబ్ లైసెన్స్ కోసం దరఖాస్తు చేసి ఉన్నారు. ఇప్పటికే దీనికి సంబందించిన పరిశీలన పూర్తవగా.. త్వరలో మంజూరు చేయనున్నారు.



వైద్యశాలలో ఐసీయూ

ఓపీ.. వెరీ హ్యాపీ

బాపట్ల ఏరియా వైద్యశాలలో మొత్తం 24 మంది స్టాఫ్ నర్సులు ఉన్నారు. గతంలో కనీసం వంద కూడా లేని ఓపీ.. నేడు రోజుకి 300 నుంచి 400లకు పెరిగింది. బాపట్ల జిల్లా కేంద్రంగా అవతరించాక చుట్టుపక్కల గ్రామాలకు ఏరియా వైద్యశాల వరంగా మారింది. దీంతోపాటు బాపట్ల ఏరియా వైద్యశాల అభివద్ధి కమిటీ సమావేశంలో మరికొన్ని సౌకర్యాల కల్పనకు తీర్మానం చేశారు. ఇందులో భాగంగా సీసీ కెమెరాలు, ఎస్ఎన్ సీయూ 20 బెడ్స్ మంజూరుకు ప్రతిపాదించారు. ఐసీయూలో మొత్తం 12 బెడ్లు ఉన్నాయి. అన్ని మందులు అందుబాటులోకి తీసుకొచ్చారు. ప్రత్యేక గదులు 14 సిద్ధం చేశారు.

ఆగస్టు 15 నాటికి మరిన్ని సేవలు



బాపట్ల ఏరియా వైద్యశాలలో ఆధునిక వైద్యం అందుబాటులో ఉంది. స్థానిక ఎమ్మెల్యే కోన రఘుపతి ఆధ్వర్యంలో అన్ని సౌకర్యాలను ప్రభుత్వం కల్పిస్తోంది. ఇప్పుడు 16 మంది ప్రత్యే వైద్య సిబ్బందితో రోగులకు సేవలందిస్తున్నాం. ప్రతి రోజూ మూడు ప్రసవాలు జరుగుతున్నాయి. ఇవి జిల్లాలోనే ప్రథమం.

– డాక్టర్ కొప్పుల సిద్దార్థ, సూపరింటెండెంట్, బాపట్ల ఏరియా వైద్యశాల.

నైపుణ్యాభివృద్ధికి అవగాహన ఒప్పందం



అవగాహన ఒప్పందం కుదుర్చుకున్న ప్రతినిధులు

బాపట్ల అర్బన్: విద్యార్థులకు నైపుణ్య శిక్షణను అందించటానికి బాపట్ల ఇంజినీరింగ్ కళాశాల, కేఎల్ యూనివర్శిటీల మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. శనివారం బాపట్ల ఇంజినీరింగ్ కళాశాలలో సమావేశం జరిగింది. కేఎల్ యూనివర్శిటీ అంకుర స్థాపన నిర్వహణ అధ్యక్షుడు డాక్టర్ అలోక్ గోవిల్ మాట్లాడారు. విద్యార్థులు, గ్రామీణ ప్రాంతాల్లో సమస్యలను అర్థం చేసుకొని, వాటిని సృజనాత్మకతతో పరిష్కరించాలన్నారు. తద్వారా వారి స్థితిగతులను మెరుగుపరచడానికి తోడ్పాటు అందించాలన్నారు. డాక్టర్ రమణకాంత్ ప్రభుత్వం విద్యార్థుల్లో అంకురాల పట్ల అవగాహన కల్పించడానికి తీసుకున్న కార్యక్రమాలను వివరించారు. డాక్టర్ సన్నీ, బాపట్ల ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ షేక్ నజీర్ మాట్లాడుతూ.. కేఎల్ యూనివర్శిటీతో ఒప్పందం జరగడం చాలా ఆనందంగా ఉందన్నారు. అనంతరం అవగాహన ఒప్పంద పత్రాలపై ఇరు బృందాలు సంతకం చేశాయి. కార్యక్రమంలో కన్వీనర్ ఐక్యుఏసీ డాక్టర్ సుందర్ కుమార్, వర్శిటీ ప్రతినిధులు సాయికిరణ్, మహేష్, సీఐఐ కన్వీనర్ డాక్టర్ లక్ష్మీశ్రీనివాస్ పాల్గొన్నారు.

నేడు అనంతవరంలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

కొల్లూరు: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఆదివారం మండలంలోని అనంతవరంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఐ.సత్యనారాయణరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున పాల్గొని సంక్షేమ పథకాల లబ్ధిని, ప్రజలకు వివరిస్తారని తెలిపారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని పేర్కొన్నారు.

మండలాభివృద్ధిలో భాగస్వాములు కావాలి



సమావేశంలో పాల్గొన్న ప్రజా ప్రతినిధులు, అధికారులు

రేపల్లె: మండలాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎంపీపీ పెనుమాల సుశీల అన్నారు. స్థానిక మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో శనివారం ఆమె మాట్లాడారు. అధికారులు ప్రజా ప్రతినిధులతో గ్రామంలో అభివృద్ధి పనులకు నిరంతరం సమీక్షిస్తూ ఉండాలన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి చైతన్య పరచాలని సూచించారు. అర్హత ఉండి ఎవరైనా ప్రభుత్వ పథకాలను పొందలేకపోతే సచివాలయ సిబ్బంది విధిగా సమస్యలను తెలుసుకుని ప్రభుత్వ పథకాలు పొందేవిధంగా కృషి చేయాలని చెప్పారు. సమావేశంలో తహసీల్దారు మల్లికార్జునరావు, ఎంపీడీవో శివపార్వతి, ఈవోపీఆర్డీ మల్లికార్జునరావు, మండల ఉపాధ్యక్షులు పీతా వెంకటేశ్వరరావు, రావు నెహ్రులక్ష్మి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో సత్వర సేవలు



ధ్రువపత్రం అందజేస్తున్న మోపిదేవి హరనాథబాబు



పెదపల్లిలో ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న ఎంపీపీ శ్రీకృష్ణయ్య

రేపల్లె: జగనన్న సురక్షతో ప్రజలకు సత్వర సేవలు అందుతాయని మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ అన్నారు. పట్టణంలోని 12, 13వ వార్డులకు సంబంధించి 13వ వార్డు సచివాలయంలో శనివారం జగనన్న సురక్ష శిబిరం నిర్వహించారు. 852 సర్టిఫికెట్లను అందజేశారు. వైస్ చైర్మన్‌లు గుజ్జర్లమూడి ప్రశాంత్‌కుమార్, తూనుగుంట్ల కాశీవిశ్వనాథగుప్త, కమిషనర్ విజయసారథి, తహసీల్దారు మల్లికార్జునరావు, నాయకులు పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష'ను సద్వినియోగించుకోవాలి

నగరం: మండలంలోని పెదపల్లి, పూడివాడ గ్రామాల్లో శనివారం జగనన్న సురక్ష శిబిరం జరిగింది. ఎంపీపీ చింతల శ్రీకృష్ణయ్య పాల్గొని మాట్లాడారు. పెదపల్లిలో 886, పూడివాడలో 796 మందికి వివిధ ధ్రువీకరణ పత్రాలు అందించినట్లు అధికారులు వెల్లడించారు. తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావు, ఎంపీడీవో చక్రపాణి ప్రసాద్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకున్న వెంటనే ధ్రువపత్రాలు

నిజాంపట్నం: సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని ఎంపీటీసీ సభ్యుడు మోపిదేవి హరనాథబాబు తెలిపారు. కొత్తపాలెం, అడవులదీవి గ్రామాల్లో శనివారం జగనన్న సురక్ష శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా హరనాథబాబు అర్జీదారులకు పలు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. జెడ్పీటీసీ నర్రా సుబ్బయ్య, సర్పంచ్‌లు కె.రవి, శౌంతి శ్రీనివాసరావు, ఎంపీడీఓ నాగలక్ష్మి, ఎంపీటీసీలు నాజర్‌ఖాన్, గోపాలకృష్ణ, లంకె శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ రామాని కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలే లక్ష్యం

బాపట్ల అర్బన్: ఎన్నుకున్న ప్రజలకు అన్ని విధాల చేదోడు వాదోడుగా ఉండాలన్నదే ముఖ్య మంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి ఆకాంక్ష అని ఎమ్మెల్యే కోన రఘుపతి, జాయింట్ కలెక్టర్ చామకురి శ్రీధర్ పేర్కొన్నారు. బాపట్ల మండలంలోని వెదుళ్ళపల్లి, పడమర బాపట్ల పంచాయతీ సచివాలయాల్లో శనివారం జరిగిన జగనన్న సురక్ష శిబిరంలో అర్జీదారులకు ధ్రువపత్రాలను అందజేశారు. మండలాధ్యక్షుడు కోకి రాఘవరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ వడ్డిముక్కల డేవిడ్, ఎంపీపీ చిన్న పోతుల హరిబాబు, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ గవిని కృష్ణమూర్తి, బాపట్ల జిల్లా ఆర్డీవో గంధం రవీందర్, జిల్లా విద్యాశాఖ అధికారి రామారావు, ఎంపీడీవో ఎ.రాధాకృష్ణ, ఈవోపీఆర్డీ శరత్ బాబు, బోగిరి ప్రసాద్ సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ట్రై సైకిల్ అందజేత

బాపట్ల అర్బన్: బాపట్ల మండలం పడమర బాపట్ల పంచాయతీకి చెందిన భోగి రెడ్డి వెంకటేశ్వరరెడ్డికి ఎమ్మెల్యే కోన రఘుపతి ట్రై సైకిల్‌ని శనివారం అందజేశారు. బాపట్ల మండల పార్టీ అధ్యక్షుడు కోకి రాఘవరెడ్డి, జిల్లా దివ్యాంగుల సంఘం అధ్యక్షుడు చల్ల రామయ్య సూచన మేరకు.. జగనన్న సురక్ష కార్యక్రమంలో ట్రై సైకిల్‌ను వెంకటేశ్వరరెడ్డికి ఎమ్మెల్యే కోన రఘుపతి అందజేశారు.

కుక్కను తప్పించబోయి.. బైక్ మీద నుంచి పడి యువకుడి మృతి



మృతుడు శివసుబ్రహ్మణ్యం

నగరం: ఎదురుగా వస్తున్న కుక్కను తప్పించబోయి ద్విచక్రవాహనంపై నుంచి పడి యువకుడు మృతిచెందిన ఘటన శనివారం మంత్రిపాలెం గ్రామం వద్ద జరిగింది. ఎస్ఐ రామకృష్ణ సమాచారం మేరకు.. నిజాంపట్నం మండలం అడవులదీవి శివారు గుణంతిప్ప గ్రామానికి చెందిన మేకా శివసుబ్రమణ్యం(20) ఇంటి వద్ద నుంచి రేపల్లె కళాశాలకు ద్విచక్రవాహనంపై వెళ్తున్నాడు. మంత్రిపాలెం వద్ద ఎదురుగా వస్తున్న కుక్కను తప్పించబోయి జారిపడి కిందపడ్డాడు. దీంతో శివసుబ్రమణ్యాంకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రుడిని రేపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సుబ్రమణ్యం మృతి చెందాడు. మృతుడు రేపల్లె ఏబీఆర్ డిగ్రీ కళాశాలలో బీఎస్సీ రెండో సంవత్సరం చదువుతున్నాడు. ప్రతి రోజు కళాశాలకు ద్విచక్రవాహనంపై వెళ్తుంటాడు. మూడు నెలల క్రితం కొత్త బైక్ కొన్నాడు. కుమారుడు మరణవార్త తెలుసుకున్న కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు. మృతుని తండ్రి శ్రీను ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు.

100 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

5 లీటర్ల నాటుసారా స్వాధీనం



బెల్లంఊటను ధ్వంసం చేస్తున్న సీఐ శ్రీనివాసరావు, సిబ్బంది

నిజాంపట్నం: నాటుసారా తయారి, విక్రయాలు చట్టరిత్యా నేరమని నగరం ఎస్ఈబీ సీఐ శ్రీనివాసరావు హెచ్చరించారు. అడవులదీవి పంచాయతీ చంద్రమౌలినగర్ గ్రామ శివారులోని మడ అడవుల్లో సెబ్ పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ వివరాలు వెల్లడించారు. చంద్రమౌలినగర్‌లో అడ్రాజు వెంకటేశ్వరరావు నాటుసారా తయారు చేస్తుండగా పట్టుకోవడం జరిగిందన్నారు. ఈ దాడుల్లో 5 లీటర్ల నాటు సారాని స్వాధీన చేసుకుని, 100 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు తెలిపారు. నిందితుడిని అదుపులోనికి తీసుకుని కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

14 వాహనాలకు.. రూ.1.43లక్షలు



ద్విచక్ర వాహనాలకు వేలంపాట నిర్వహిస్తున్న సెబ్ అధికారులు

నగరం: నాటు సారా, అక్రమ మద్యం కేసుల్లో పట్టుబడిన వాహనాలను బహిరంగ వేలం నిర్వహించగా 14 వాహనాలను పాటదారులు దక్కించుకున్నారని స్పెషల్ ఎన్ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ దేవర శ్రీనివాసరావు చెప్పారు. నగరంలోని ఎస్ఈబీ పోలీస్ స్టేషన్‌లో శనివారం ఆటో, ద్విచక్రవాహనాలకు వేలం పాట నిర్వహించారు. వివిధ కేసుల్లో సీజ్ చేసిన 19 వాహనాల్లో.. 14 వాహనాలను రూ.1.43 లక్షలకు పాటదారులు దక్కించుకున్నట్లు సీఐ వెల్లడించారు. మిగిలిన 5 వాహనాల వేలానికి పాటదారులు ముందుకు రాలేదని, త్వరలో వాటికి వేలం నిర్వహిస్తామని వెల్లడించారు.

పరిమితి దాటితే చర్యలు

భట్టిప్రోలు: ఆటోలలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించకూడదని ఎస్ఐ అంబటి చంద్రశేఖర్ ఆటో డ్రైవర్లకు సూచించారు. శనివారం వెల్లటూరులో బస్టాండ్ సెంటర్‌లో ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనదారులు, ఆటోవాలాలు అన్ని పత్రాలను వాహనాల్లో ఉంచుకోవాలని చెప్పారు. జాగ్రత్తలు పాటించడం ద్వారా ప్రమాదాలు అరికట్టవచునని సూచించారు. ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.

ప్రజల మేలు కోసం.. పరితపిస్తున్న ప్రభుత్వం



పోతార్లంక జగనన్న సురక్ష శిబిరంలో సర్టిఫికెట్ అందజేస్తున్న మంత్రి మేరుగ నాగార్జున



ఖాజీపాలెంలో ధ్రువీకరణ పత్రం అందజేసిన ఎమ్మెల్యే కోన రఘుపతి

రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున

కొల్లూరు: ప్రజల ఇబ్బందులు తొలగించి, వారికి మేలు చేకూర్చలన్న తలంపుతో రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం పరితపిస్తోందని రాష్ట్ర సాంఘిక, సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున అన్నారు. శనివారం పోతార్లంకలో నిర్వహించిన జగనన్న సురక్ష శిబిరంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రజా సంక్షేమం కోసం పనిచేస్తోందని, విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని సభలో మంత్రి స్పష్టం చేశారు. వందల హామీలను గుప్పించి, అధికారంలోకి వచ్చాక ఒక్కటి కూడా నెరవేర్చని గత తెలుగుదేశం ప్రభుత్వంలో నాయకులు అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. మళ్లీ అధికారంలోకి వచ్చేందుకు టీడీపీ చేస్తున్న దుష్ప్రచారాలను, కుయుక్తులను ప్రజలు నమ్మకుండా సీఎం వైఎస్ జగన్ పక్షాన నిలవాలని కోరారు. ప్రజా ధనాన్ని ఎటువంటి అవినీతికి ఆస్కారం లేకుండా, వలంటీరు, సచివాలయ వ్యవస్థల ద్వారా నేరుగా ప్రజలకే అందజేస్తున్న ఏకైక రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ దేశంలోనే పేరుగడించిదన్నారు. కరోన వంటి విపత్కర పరిస్థితుల్లో సైతం వలంటీర్లు ప్రతి ఇంటికీ వెళ్లి.. సేవలందించారని గుర్తుచేశారు. 910 మంది అర్జీదారులకు పలు ధ్రువీకరణ పత్రాలను మంత్రి మేరుగ అందజేశారు. జువ్వలపాలెంలో జరిగిన శిబిరంలో 594 మంది అర్జీదారులకు ధ్రవపత్రాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మురాల రాంబాబు, ఎంపీటీసీ సభ్యురాలు గాలి ఎస్తేరురాణి, సర్పంచ్ సూరపనేని వెంకటేశ్వరరావు, తహసీల్దారు ఎ.శ్రీనివాసరావు, ఆలయ కమిటీ చైర్మన్ పరిశ గాంధి, జేసీఎస్ మండల ఇన్‌చార్జి అయిల సుబ్బారావు, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

సచివాలయాలతో.. సంక్షేమ పథకాలు

ఖాజీపాలెం(కర్లపాలెం): గ్రామ సచివాలయాల ద్వారా అర్హులకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యే కోన రఘుపతి పేర్కొన్నారు. పిట్టలవానిపాలెం మండలంలోని పోతనకట్టవారిపాలెం, ఖాజీపాలెం గ్రామ సచివాలయాల్లో శనివారం జగనన్న సురక్ష శిబిరాలు జరిగాయి. ఎమ్మెల్యే కోన రఘుపతి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు ఎలాంటి ఖర్చు లేకుండా ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్నట్లు ఎమ్మెల్యే చెప్పారు. ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడు, జనసేన అధినేత పవన్ కల్యాణ్ సచివాలయ, వలంటీర్ వ్యవస్థల మీద చేసిన అనుచిత వ్యాఖ్యలు సమంజసం కాదని కోన హితవు పలికారు. సర్పంచ్‌లు కుంటం అనూష, ఇనుముల పార్వతి, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు దెందుకూరి సీతారామరాజు, ఎంపీటీసీ కాగిత కాంతకుమారి, మాజీ ఎమ్మెల్యే మంతెన అనంతవర్మరాజు, రాష్ట్ర రోడ్లు రహదారుల కార్పొరేషన్ డైరెక్టర్ అహ్మద్ హుస్సేన్, సొసైటీ చైర్మన్ మండే విజయకుమార్, ఎంపీడీవో మారుతీ శేషమాంబ, తహసీల్దారు కవిత, పలువురు సర్పంచ్‌లు పాల్గొన్నారు.

బడ్జెట్‌ను తిరస్కరించిన ఎంపీటీసీలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ వనజ

కర్లపాలెం: మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శనివారం జరిగిన సర్వసభ్య సమావేశం బడ్జెట్ ఆమోదించకుండానే ముగిసింది. బడ్జెట్ ప్రతిపాదనను ఎంపీటీసీలు మూకుమ్మడిగా తిరస్కరించారు. ఎంపీపీ యారం వనజ సమావేశానికి అధ్యక్షత వహించారు. మండల పరిషత్ బడ్జెట్ ఎజెండా ప్రతులు తమకు ఇవ్వకుండా సమావేశంలో, చర్చించకుండా బడ్జెట్ ఎలా ఆమోదిస్తారని ఎంపీటీసీలు ఎంపీడీవో, డీపీవో దాసరి రాంబాబు నిలదీశారు. బడ్జెట్‌ను ఆమోదించేది లేదని తేల్చి చెప్పారు. ఎంపీడీవో దాసరి రాంబాబు అధికారులతో అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. అనంతరం సమావేశం ముగిసిందని అధికారులు ప్రకటించటంతో ఎంపీటీసీ సభ్యులు ఒకింత ఆశ్చర్యానికి గురయ్యారు. మండల పరిషత్ బడ్జెట్‌కు సంబంధించిన అజెండా ప్రతులు తమకు ఇవ్వకుండా ఎజెండాలోని అంశాలను సమావేశంలో చర్చించకుండా బడ్జెట్ ఎలా ఆమోదిస్తారని కర్లపాలెం-1 ఎంపీటీసీ సభ్యులు దొంతిబోయిన లక్ష్మీ సామ్రాజ్యం, కర్లపాలెం-2 ఎంపీటీసీ సభ్యుడు ఆసిఫ్ అలీ, కోఆప్షన్ సభ్యుడు అమీర్‌బేగ్ ఎంపీడీవో దాసరి రాంబాబును నిలదీశారు. ఈ నేపథ్యంలో ఎంపీటీసీ సభ్యులకు బడ్జెట్ ఎజెండా ఫారాలు ఎందుకు ఇవ్వలేదని, మండల పరిషత్ కార్యాలయ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుత బడ్జెట్ ప్రతిపాదనలను ఉపసంహరించుకుంటున్నామని మరోసారి సమావేశం ఏర్పాటు చేసి బడ్జెట్ ఆమోదించుకుందామని చెప్పటంతో ఎంపీటీసీ సభ్యులు శాంతించారు. ఏఎంసీ చైర్మన్ దొంతిబోయిన సీతారామిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు పిట్ల వేణుగోపాల్‌రెడ్డి, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు పందరబోయిన సుబ్బారావు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.